# మంత్రసాని గండం!

'శ్రీరాజు'




దారి కాసిన గూండాలాగ, ఆ మైదానాన్ని రెండు ముక్కలు చేస్తూ హుందాగా నిలబడి ఉంది ఆరంతస్తుల ఆఫీసు భవనం.

ఆరంతస్తుల ఆ ఆఫీసు భవనానికి ముచ్చటగా మూడే మూడు ముఖద్వారాలు. అంత వెడల్పయిన ఆ భవనాన్ని, తండ్రి పంచిన ఆస్తిలా మూడు సమభాగాలు చేస్తున్న మూడు బోర్డులు అతి ఆకర్షణీయంగా మూడు వేరు వేరు కంపెనీల పేర్లను సూచిస్తూ చూపరులను ఆకట్టుకొంటున్నాయి.

అందులో మధ్య బోర్డు కిందగా ఉన్న ముఖద్వారాని కెదురుగా ఆగిన టాక్సీలోంచి ఒక యువకుడు దిగాడు.


అతణ్ణి దూరంనుంచి చూసిన వారికి దగ్గర నుంచి చూస్తే బాగుండుననిపిస్తుంది. దగ్గర నుంచి చూసినవారికి అతనితో పరిచయం చేసుకోవా లనిపిస్తుంది. పరిచయం చేసుకొన్న వారికి— ''పూర్వజన్మ పాపఫలం ... అనుభవించక తప్పదు!'' అనిపిస్తుంది.

డ్రైవర్‌కి డబ్బులిచ్చేసి అతను నాలు గడుగులు ముందుకువేశాడు.

''ఇదుగో! ఇదీ సమకోణం ...'' అనిపించేటంతగా ముందుకు వంగి, తిరిగి వెంటనే స్కేలుపెట్టి గీసిన సరళ రేఖ లాగ నిటారుగా నిలుచుని, ప్రక్కనున్న గోడకున్న మీట నొక్కాడు తలుపు ప్రక్కనున్న బుగ్గ మీసాల ఆసామీ.

యువకుని కెదురుగా ఉన్న ముదురు నీలం రంగు అద్దాల తలుపు సుతారంగా తెరుచుకొని దారి ఇచ్చింది యువకుడు లోని కెళ్ళగానే నిశ్శబ్దంగా మూసుకొంది. హిమాలయాలలో తపస్సు చేసుకొనే ఋషి కయినా ఒళ్ళు ఝల్లుమనిపించేంత చల్లగా ఉంది వాక్ వే అనబడే వరండా!

కొద్దిగా నడిచి, మూడు వైపులా చీలిపోయిన దారి ప్రక్కగా ఉన్న లిఫ్ట్



కలువ కన్నె

ఫోటో—ఎస్. సత్యనారాయణ (తిరుపతి)

దగ్గర ఆగాడతను. ప్రక్కనున్న బటన్ నొక్కాడు. లిఫ్ట్ కిందకు దిగుతున్నట్టు, మూడో అంతస్తులో ఉన్నట్టు సూచించింది, ద్వారంపైన అలంకరించబడిన 'ఇండికేషన్ ప్లేట్'.

రెప్పపాటుకాలం అతని కనుబొమ్మలు ముసుగుగా కనపడ్డాయి. అతని తెల్లని ఎడమ అరచేయి నల్లని టెరిలిన్ పాంట్ జేబులోకి వెళ్ళి మాయమయింది. మెత్తగా ఉన్నాయనిపించే అతని కుడిచేతి వేళ్ళు 'టై నాట్'ని సున్నితంగా సవరించాయి.

లిఫ్ట్ వచ్చి ఆగింది. ఒకే ఒక వ్యక్తి దిగాడు. యువకుడు లోని కెళ్ళగానే తలుపు మూసుకొంది.

ఆరో అంతస్తులో దిగిన 'అతను' తిన్నగా ఎనిమిదో నంబరు గది దగ్గర ఆగాడు.

"టిక్ ... టిక్ ..."

"......"

నిశ్శబ్దంగా తలుపు తెరుచుకొని లోని కెళ్ళిన అతణ్ణి చూసి — "గుడ్ మార్నింగ్ మిస్టర్, రావ్! ... ప్లీజ్ కమ్ అండ్ టేక్ యువర్ సీట్" అని చదువుతున్న వీక్లీని ప్రక్కన పెట్టి, వెనకనున్న 'యుఫోమ్' మీదకు కొద్దిగా వాలారు మిస్టర్ శతపతి.

మిస్టర్ శతపతి కేవలం నూరు మందికి మాత్రమే భర్త కాదు. ఎనిమిది సెక్షన్స్ గల ఆ డిపార్టుమెంటులో పని చేస్తున్న సుమారు రెండు వందల మంది భరిస్తున్న వ్యక్తి.

పొద్దున్న తాగే బెడ్ కాఫీ 'కప్పు' దగ్గర నుండి, రాత్రి తొడుక్కొనే 'నైట్ గౌన్' వరకూ సర్వమూ ఉచిత సౌకర్యాల లిస్టులో చేర్చబడగా, జీతం రూపేణా కేవలం నాలుగువేల రూకలు మాత్రమే తీసుకుంటున్న లక్ష్మీపతి!

రావ్ గుడ్‌మార్నింగ్ అందుకొని ఆసీనుడయ్యాడు — 'ఏమిటి సంగతి లా దయచేశారు?' అన్నారు శతపతి, స్ప్రింగ్ చెయిర్‌లో ముందుకీ వెనక్కీ ఊగుతూ.

"ఆఁ ... ఏం లేదు ... అసలు వారం రోజులైనా వద్దామనే అనుకొంటున్నాను. లాస్ట్ వీక్ ఒక పెళ్ళొచ్చింది..

పెళ్ళి అన్న మాట వినబడేసరికి శతపతి గారు ఊగడం ఆపి, టేబిల్ మీద ఆనుకొని, ఉత్సాహంగా వినసాగారు.

"ఒక పది వరకూ జాగర్త చేశాను. అందులో ఏడుదాకా డిస్ట్రిబ్యూటయిపోయాయి. మిగిలిన మూడూ మీ కోసమనే అట్టే పెట్టాను. సాయంత్రం పంపిస్తాను."

"థాంక్యూ! థాంక్యూ!!"

"ఆఁ ... అన్నట్టు ... నరసింహం గారు తెలుసు కదూ!"

"ఎవరూ?"

"అదేనండీ ... బిజినెస్ మాగ్నెట్ ... ఇండస్ట్రియలిస్ట్."

"ఆఁ ... ఆఁ ..."

"అతనికి మా క్లబ్ తరఫున సన్మానం చేసి పర్సు ప్రజెంట్ చేద్దామని డిసైడ్ చేశాం. ఆ నాడు ఒక చిన్న గాన కచేరీ కూడా ఏర్పాటుచేశాం ..."

చెప్పడం ఆపి, రావ్ తన ఫ్రంట్ పాకెట్ లోంచి రెండు సన్నగా ... పొడుగ్గా ... గులాబీ రంగు అట్టలున్న పుస్తకాలు తీసి శతపతి ముందుకు తోసి, మళ్ళీ కొనసాగించాడు.

"మీ కొక రెండు బుక్స్ ఇస్తున్నాను. టోటల్ ఫార్టీ టికెట్స్ ... ఈచ్ ఫైవ్. థర్టీఫస్టున ఫంక్షన్ ఏర్పాటు చేశాం. ఈ వేళ ట్వంటీయత్ కదూ! ... ఆఁ ... ఇవి మీరు ఎల్లుండిలోగా క్యాష్ చేసి ఇచ్చెయ్యాలి ... సో ... సాయంత్రం అవి పంపే ఏర్పాటు చేస్తాను."

"నో నో నో నో నో..." బుక్స్ తీసి అవుట్ ట్రేలో వడేస్తూ గాభరాగా అన్నారు శతపతి. "సాయంత్రమయితే మీరు మరిచిపోవడాని కవకాశముంది ... 'ఆలస్యం అమృతం విషం' అన్నారు ... ఆఁ ... మీ రివ్వాళ కార్లో వచ్చారా?"

"లేదు... కారు గారేజీ కెళ్లింది. టాక్సీలో వచ్చాను."

"రైట్! నా కారు పంపుతాను. అది మిమ్మల్ని డ్రాప్ చేసి ... అవి కలెక్ట్ చేసుకొని వచ్చేస్తుంది ..."

"ఓ కే ... యాజ్ యూ ప్లీజ్ ..."

రావ్ లేచాడు.

శతపతి పర్సులోంచి రెండు పులి బుర్రలను తీసి, అతని చేతి కిచ్చి, లేచి కరచాలనం చేశారు.

"బాలెన్స్ తరవాత చూసుకొందాం!"

"రైటో ... సీ యూ డే ఆఫ్టర్..."

నిశ్శబ్దంగా తెరుచుకొన్న తలుపు వెనకాతల, అంతకంటె నిశ్శబ్దంగా నిలుచున్న రమణ ఎంతో నిశ్శబ్దంగా చేసిన అభివాదాన్ని 'హవ్వార్యూ'తో అందుకొని చకచకా వెళ్లిపోయాడు రావ్.

లోనికెళ్ళి ట్రే క్లియర్ చేస్తున్న రమణ, ట్రేలోని కాగితాలు పూర్తిగా తీసేదాకా వీక్లీ లోంచి దృష్టిని మరల్చ లేదు శతపతి.

అప్పుడు కూడా మరల్చని దృష్టితో వాలుగయిదు పొడి ముక్కలు అన్నారు: "మూడూ ... ఆ మీద నున్న

రెండు బుక్స్‌లోని టిక్కెట్లూ నలుగురికీ ఇవ్వు! ... డాన్స్ ప్రోగ్రామ్ ... చాలా బాగుంటుంది ... డబ్బు ఇప్పుడె వెంటనే ఇవ్వనక్కరలేదులే ... ఎల్లుండి పొద్దున్నకి నాకు చేరితే చాలు ..."

పూర్తి చేసిన సంభాషణ తరవాత ఆపిన పీక్లీ పత నాన్ని కొనసాగించారు గణపతి.

రమణ వెళ్ళిపోయాడు అప్పటి ప్రేమ భారాన్ని మోసుకొంటూ.

"ఏమిటోయ్ ఇది?"

"డాన్స్ ప్రోగ్రామండీ!"

"ఇదెవ రంటగట్టారు?"

"పెద్ద గురూగారు!"

అయిదు రూపాయల నోటు బయట కొచ్చింది.

బోణీ బాగుందనుకొన్నాడు రమణ!

పెద్ద గురూగారి పేరున కొన్ని అమ్ముడయ్యాయి.

కళాపోషణ పేరున అమ్ముడయ్యాయి కొన్ని.

ఆఫీసుల అలవాటు ప్రకారం కొన్నారు కొందరు.

తమ కెదుటి సీట్ల ఆడవారు కొన్నారని కొందరు కొన్నారు.

చాలామంది మరువాడిస్తామన్నారు.

కొద్ది మంది వెంటనే 'పే' చేశారు.

ఇక నాలుగే నాలుగు మిగిలాయి.

* * *

ఎందుకయినా మంచిదని, లోనికి ఒకసారి తొంగిచూసి మరీ దూరాడు రమణ ఆ గదిలోకి. ఆ గదిలో ఉన్న రెండు బల్లల వెనక ఉన్న కుర్చీలలోనూ ఒకటి ఖాళీగా ఉంది.

గబగబ రెండో కుర్చీలో ఉన్న వ్యక్తి దగ్గర కెళ్ళి, హడావిడిగా పాట పాడేసి, టికెట్ చింపేసి ఇచ్చేశాడు రమణ.

రమణకి అతని 'కొనడం' మీద చాలా నమ్మకం ఉంది.

ఇంకా అతనికి చాలా ఉన్నది— ఆ ఎదురుగా ఖాళీగా నవ్వుతున్న కుర్చీ గురించి 'భయమే!'

చేతి కందిన అయిదు రూపాయల నోటు హడావిడిగా జేబులో కుక్కేసుకొని అంతకన్న హడావిడిగా ఆ గదిలోంచి బయట పడబోయిన రమణ, ద్వారానికి నరిపడా నిలుచున్న బొజ్జతో ఢీకొన్నాడు.

ఆ బొజ్జగల ఆసామీ పేరు గణపతి!

ఢీకొనడంలో జారి, ఎగిరి, ఆసాంతా పడిన టిక్కెట్ల పుస్తకాన్ని రమణ వంగి తీసేవరకూ ఆగి, తీసిన వెంటనే చటుక్కున అతని చేతిలోంచి అది లాగేసుకొని, "ఏమిటోయ్ ఇది?"

అని, జవాబుకోసం ఆగకుండా, గునగునా నడిచి ఖాళీగా ఉన్న తన కుర్చీలో క్రీరుమని శబ్దం చేస్తూ కూలబడ్డాడు గణపతి!

కీ అయిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డు లాగ, పాత పాటనే ఇష్టం లేకపోయినా పాడాడు రమణ.

"అయితే పెద్దయ్యగా రంటగట్టారా? ..." సులోచనాలు సవరించుకొని చదువుతూ అడిగా డాయన.

"అయ్యా! ..."

"ఇంకా ఎన్ని ఉన్నాయోయ్?"

"మూడుందండీ!" అన్నాడు—'నాకు మూడండి' అని మనసులో అనుకొంటూ!

"ఇదేదో మంచి పార్టీలాగే ఉందే! ... నే నొక టుంచుతానోయ్!'


గుండెల్లో పడ్డ రాయి మీద కెగ బ్రాకి, వచ్చి వెలక్కాయ రూపంలో గొంతు కడ్డుపడింది.

ఖాళీ అయిన గుండె, 'అయిదూ గోవిందా!' అనుకొంది.

"ప్రోగ్రామ్ ఎప్పుడన్నావూ?"

"......"

"థర్టీ ఫస్టునా? మరేమీ ... అయితే మూడూ ఉంచుతాను. మా అమ్మాయి, అల్లుడు కూడా ఆ నాటికి వస్తా గ."



శిల్పం

శిల్పి—ఓ. ఎస్. నారాయణ (హిందూపురం)



అంతవరకూ దబదబమంటున్న రమణ గుండెలు లబలబమన్నాయి.

"లేదండీ ... ఒకటి మీ రుంచుకొని, రెండు ఇచ్చెయ్యండి ... పెద్దయ్య గారూ, అమ్మగారూ వస్తారట!"

"ఫర్వాలేదు లేవోయ్ ... వస్తే రానీ... వారికి కావలిస్తే వాళ్ళే మళ్ళీ కొనుక్కో గలర్లే!" నిర్లక్ష్యంగా సులోచనాల లోంచి చూస్తూ అవి, టిక్కెట్లు మూడూ చింపుకొని, పుస్తకం రమణ ముందుకు గిరాటేశా డాయన!

సహాలక్ష విధాలుగా బతిమాలాడు రమణ!

సహాలక్షన్నొక్క మొండి సమాధానాలు చెప్పి 'ససేమిరా' అన్నాడు గణపతి. 'వెధవ నా కాజువల్ లీవు పాటి వయసు లేదు ... వీడా నా దగ్గర కొచ్చి గంతులు వేసేది!' అనుకొంటూ.

చేసేది లేక డబ్బులకి మరునాడు వస్తానని వెళ్ళిపోయాడు రమణ.

రమణ అంతకుముం దెప్పుడూ గణపతితో భేటీ పడలేదు. కానీ, మిగిలిన వారి విషయాలలో గణపతి వ్యవహారం చూసిన రమణ ఆ పదిహేను గురించి బెంగపెట్టుకొన్నాడు.

మరునాడు అందరి దగ్గరకూ వెళ్ళి డబ్బు తీసుకొన్నాక, గణపతి సీటు దగ్గర అరగంట వేళ్ళాడాడు రమణ.

కేసు మరువాటికి వాయిదా వేయబడింది.

మరునాడు కూడా 'వేళ్ళాడ్డం'... డ్యూటీ గంటన్నర చేసిన తరవాత— 'ముష్ఫై ఒకట్లే ... అంటే జీతాల నాడు' కనిపించమనిపించుకొని భోజనానికి బయలుదేరాడు.

రమణ దగ్గర అప్పుడు తిన్నకపోయినా దమ్మిడీ లేదు.

ఉన్నా, అది చెల్లకపోను!

'గణపతి పదిహేను సంగతి దేముడెరుగు. మధ్యాహ్నానికల్లా మొత్తం అప్పచెప్పకపోతే శతపతి తన డొక్క చీరేసి, అందులోంచి వచ్చే వేడి నెత్తురుని సోడాకూడా కలుపుకోకుండా తాగేస్తాడని' రమణకి తెలుసు.

అందుకే—తనను తిన్నకపోయినా లేని దమ్మిడీలతో, పదిహేను రూపాయలు ఎలా సర్దుబాటు చెయ్యడమా.' అని, భోజనానికి వెళుతూ ఆలోచించాడు. అయ్యరు టేబిల్ ముందున్న చిన్న సైజు క్యూలో మీల్స్ కార్డు పట్టుకొని నిలుచున్నప్పుడు కూడా ఆలోచించాడు.

అప్పారావు అరిటాకు పెట్టిన దగ్గర నుంచి, తను మజ్జిగ అన్నం తినే సమయంలో మరొకాయన అతని

కాయిన్ తన ఆకు ముందు టక్కున పెట్టేవరకు, ఆలోచిస్తూనే ఉన్నాడు!

* * *

అనుకున్న ముచ్చట ఒకటే అలవాటు ప్రకారం ముప్ఫై తరవాతనే వచ్చింది!

ఆ మధ్యాహ్నం — భోజనం అయిన ఆయాసం తీరడం కోసం ఫైలు ముందు పడేసుకొని అది చూసే నెపంతో — టేబిల్ మీద ఆన్చిన చేతుల్లో పెట్టుకొన్న బుర్రతో కునుకు తీస్తున్న గణపతి నిద్రలేచి, తల ఎత్తి చూసేసరికి — టేబిల్‌కి పట్టిన సాలీడు దారం కనుపించింది.

'అరే! ... నేను ఎన్నాళ్లయి పడు కొన్నాను చెప్మా' అనుకొని నింపాదిగా ప్రక్కనున్న డ్రాయర్లోంచి తీసిన సులోచనా లను తుడిచి, చెవులకు తగిలించేసరికి ఎదురుగా ఉన్న 'సాలీడు దారం' లోంచి 'నమస్కారం, సార్' అని వినిపించింది.

"అరే, రమణా, నువ్వటోయ్! ! ... ఏమిటో అనుకున్నాను ... ఎంతసే పయింది వచ్చి?" అన్న గణపతి పరామర్శకు—"అబ్బే ... ఇప్పుడే', సార్ ... అర గంట కిందట..." అని నసిగాడు రమణ!

"ఊఁ ... ఏం కావాలి?"

"అదే, సార్ ... ఆ పదిహేనూ ..."

"ఓహో ... అదా! జీతం ఇంకా తీసుకోలేదోయ్ . కాఫీ తెచ్చినప్పు డిస్తాలే."

"అలాగే, సార్! .."

సాలీడు దారం వెళ్లిపోయింది.

* * *

"కాఫీ ఇదుగో, సార్ ..."

"కప్పు తరవాత కడిగేద్దువు గానీలే ... ఈవేళ కాఫీ యమ ఇదిగా ఉందోయ్ ... తాపీగా తాగుతాను ... నువ్వెళ్ళు."

'కొంప మునిగిందిరా, దేముడా ... ఈ కాఫీ పావలా ఎగ్గొట్ట దలుచుకొన్నా డేమిటి చెప్మా' అనుకొని — "అలాగే, సార్ ... సార్ ... ఆ పదిహేనూ ..." గుర్తు చేశాడు రమణ.

"ఓ! అదా! ! ... ఇంకా పాకెట్ విప్ప లేదోయ్ ... అయినా, పాకెట్టు దేముడి దగ్గర పెట్టడం ఒక టుంది కదా! ... రే పిచ్చేస్తాలే ..."

"అలాగే, సార్ ..."

* * *

మరునాడు పొద్దున్న కాఫీకప్పు టేబిల్ మీద పెడుతూ "సార్..." అన్నాడు రమణ.

"ఆఁ... తెచ్చావా? ... పావలా ఇంద!" [illegible] టేబిల్ మీద పెట్టి, కప్పు అందు కొన్నాడు గణపతి.

కాఫీ తాగుతూ, 'ఇంకా ఎందుకు నిలుచున్నావ్?' అన్నట్టుగా కనుబొమ్మల లోంచి చూశాడాయన రమణ వేపు

"అదే, సార్... ఆ పదిహేనూ ..."

"అవునోయ్ ... ఆ మాటే మరిచేను సుమా! ..."

( పోనీ, సంతోషం!! ఇప్పటికయినా గుర్తు కొచ్చింది — అని మనసులోనే ధన్యవాదా లర్పించాడు రమణ ).

"నిన్న అనుకున్నట్టుగానే మా అమ్మాయి, అల్లుడు వచ్చారోయ్! ... మా అమ్మాయి ఈ టిక్కెట్టు చూసి ఎంత సరదాపడిం దనుకొన్నావ్?"

"సార్ ..." రమణలో ఉత్సాహం పెల్లుబికింది.

"అయితే, మా అల్లుడి కిలాంటివి నచ్చవుట! అందుచేత సుబ్బరంగా లీలా మహల్‌కి పోయాం..."

."సా...ర్..." నీరసం దిగజార్చింది రమణని.

"అదీ సంగతి. మొత్తంమీద నిన్న... ఆఁ ... అమ్మయ్య ... దొరికేయి ... ఆఁ ... మొత్తంమీద నిన్న ప్రోగ్రామ్‌కి వెళ్లడం పడలేదోయ్!"

[illegible] టేబిల్ మీద, రమణ ఎదురుగా పడేశాడు గణపతి.

[illegible] ఆ [illegible] టిక్కెట్లనీ [illegible] రమణ కళ్ళలో [illegible] నీరసం ద్విగుణీకృతమై నిలిచింది.


పదిరోజుల క్రితం ... ఆనాటి మధ్యాహ్నం అయ్యర్‌ని బలిమాలి, ఆఖరి పది టిక్కెట్లూ క్యాన్సిల్ చేయించుకొని అతని దగ్గర పుచ్చుకున్న ముచ్చటయిన మూడు అయిదుల్లా ఆ టిక్కెట్ల రూపంలో పకపకలాడుతూ వెక్కిరించి, ఆ పదిహేను సర్దుబాటు చేసిన తరవాత సమకూడిన రెండు వందలూ గణపతి గారి టేబిల్ మీద పేపర్‌వెయిట్ క్రింద పెట్టిన దృశ్యాన్ని జ్ఞప్తికి తెచ్చాయి.

కొంతసేపటికి — "అయ్యో ... అలా నిలుచుండిపోయా వేమిటోయ్? ఎగిరి పోతున్నాయి ... తీసుకో ..." అన్న మాటలతో ఈ లోకంలోకి వచ్చిన రమణకి, తన జేబులో ఆ మూడు టిక్కెట్లూ కుక్కిన రెండు వేళ్ళూ ... వెనువెంటనే ఫైలు పట్టుకొని ఆదరా బాదరా ఆ గదిలోనుంచి నిష్క్రమిస్తున్న రెండు కాళ్ళూ లీలగా కనుపించాయి! *


ఎట్టి పరిస్థితిలోను చికాకు చెందరు

ఆ మనోనిబ్బరానికి ఆలవాలం

'నోవా బ్రిలియంటైన్'



రోజంతా చెక్కు చెదరకుండ ఒక్క వెంట్రుకైనా రేగకుండ మనోనిబ్బరం మూర్తీభవించి నట్లున్నారు ...ఆహ్లాదకరమైన పరిమళం గల నోవా బ్రిలియంటైన్ మాడుకు, కేశములకు పోషణ నిస్తుంది మరియు ఆ దువ్విన జుట్టును దినమంతా నిశ్చయంగా నిర్దుష్టంగా ఉంచుతుంది.


శరీర లేపనానికి లక్షల మంది ఏరికోరుకుంటున్నది. దీనియొక్క వాసెలైన్ గరుకుతనాన్ని మెత్తబరుస్తుంది. దీనియందలి ప్రత్యేకమైన తైలాలు చర్మాన్ని మృదువుపరుస్తాయి. దీని సువాసన చిరకాలం నిలిచియుంటుంది.

తయారుచేసినవారు :

ది నోవా కంపెనీ,

ఎల్. బి. ఎస్. మార్గ్, భండుప్,

బొంబాయి — 78.




NOVA-7224